క్లుప్తంగా

సీఎం పర్యటనకు శ్రమించిన అందరికీ ధన్యవాదాలు


కిలివేటి సంజీవయ్య

తడ: మండలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతం చేసేందుకు శ్రమించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సీఎం సభ వర్షం కారణంగా రద్దు అయినప్పటికీ కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు వివిధ శాఖల సిబ్బంది, వివిధ వర్గాలు అందించిన సహకారం మరువలేనిదని ఆయన మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, జేసీ సూచనలతో ప్రభుత్వాధికారులు, ఇతర సిబ్బంది చేసిన సేవలు అమోఘమన్నారు. నియోజకవర్గంలోని నాయకులు అందించిన సహకారం మరువలేనిదని, అందరూ తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించి కార్యక్రమం సజావుగా సాగేందుకు సహకరించారన్నారు. పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ, విద్యుత్, పోలీస్ శాఖలతోపాటు పారిశ్రామికవాడ పరిధిలో కార్యక్రమం కావడంతో పారిశ్రామిక వర్గాలు కూడా తమవంతు సహకారం అందించడం సంతోషించదగ్గ విషయమన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: పులికాట్ ముఖద్వార అభివృద్ధితో జాలర్లకు సముద్రంలో చేపల వేటను సులభతరం చేసి, మత్స్యకారుల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నాయకులతో కలిసి మాట్లాడారు. మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకుని సీఎం జగన్ రాక కోసం సూళ్లూరుపేటలో అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ వర్షం కారణంగా వాయిదా పడిందన్నారు. ఆయన వెంట నాయ కులు కే రఘు నాయుడు, జీ సురేష్‌రెడ్డి, ఎస్ జితేంద్ర, ఎం చెంగయ్య, బీ బాలు, ఏ గోపాల్ ఉన్నారు.

కండలేరులో 11.142 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 11.142 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5 , మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లో లెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని అనుసరించాలి

గూడూరురూరల్: రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల హెచ్ఎం నాగమల్లేశ్వరరావు అన్నారు. విందూరులో జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పౌర శాస్త్ర అధ్యాపకుడు ప్రవీణ్‌గురు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం, రాష్ట్ర సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వక్తృత్వ, పాటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

తక్కువ మోతాదులో నీటి సరఫరా

గూడూరురూరల్: పట్టణంలో బుధవారం ఉదయం తాగునీటి సరఫరా తక్కువ మోతాదులో జరుగుతుందని మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ శ్రీనివాసమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే కండలేరు డ్యామ్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కారణంగా తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో జరగడం లేదని, ఇందుకు పట్టణ ప్రజలు సహకారం అందించాలని కోరారు.

పౌష్టికాహారం తీసుకోవాలి


పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యులు

రాపూరు: టీబీ వ్యాధిగ్రస్తులు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు రాజకుమారి, సూర్యధర్మేంద్ర తెలిపారు. ఆరోగ్యకేంద్రంలో టీబీకి చికిత్స పొందుతున్న 28 మందికి మంగళవారం ప్రభుత్వం అందించిన పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ టీబీ ఉన్న వారు పౌష్టికాహారం తీసుకో వడంతో ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. అందుకు ప్రభుత్వం నూనె, కందిపప్పు, వేరుశనగపప్పు, పెసరపప్పు, గోధుమ పిండి, రాగిపిండి తదితర ఆరు రకాల ప్యాకెట్లను అందిస్తుందన్నారు. శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

వచ్చే నెల నుంచి రాగులు పంపిణీ

సూళ్లూరుపేట: ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా డిసెంబర్ నుంచి ప్రతి కార్డుదారునికి కిలో రాగులు పంపిణీ చేసి, కిలో బియ్యాన్ని కార్డుదారుని కోటా నుంచి మినహాయించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్డుదారులు ఇష్టపడితే 3 కిలోల రాగులు ఇచ్చి అందుకు బదులుగా మూడు కిలోల బియ్యాన్ని మినహాయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

దివ్య సంకల్పం

వైకల్యం శరీరానికే కానీ మనసుకు కాదని, లక్ష్యసాధనతో నిరూపించాడు. ఒకటే చేయి ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసమే ఆలంబనగా పలు క్రీడల్లో విజయాల పరంపర కొనసాగిస్తున్నాడు గూడూరుకు చెందిన కరేటి అన్వేష్ పురుషోత్తం.

- వైకల్యాన్ని జయించి.. లక్ష్యసాధన
- బీడీసీఏలో సభ్యత్వం
- అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారుడు


కాకినాడలో పతకం అందుకుంటున్న అన్వేష్


అన్వేష్ వివిధ క్రీడల్లో సాధించిన పతకాలు

చిల్లకూరు: చిన్నతనం నుంచి ఆటలంటే ఇష్టం. దీంతో పలు క్రీడల్లో గురువులు వద్ద శిక్షణ పొంది, ఎన్నో బహుమతులు సాధించాడు. అప్పట్లోనే జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించి, పతకాలు కైవసం చేసుకున్నాడు. తరువాత జీవన పయనం ప్రారంభించాడు. ఓ పరిశ్రమలో పని చేస్తూ ప్రమాదవశాత్తు ఒక చేయి కోల్పోయాడు. అయినా తనలోని క్రీడా


బంగ్లాదేశ్‌లో టీ -10 కప్పుతో అన్వేష్

స్ఫూర్తిని వెలికి తీసి ఒంటి చేత్తో క్రీడల్లో విజయాలు సొంతం చేసుకుంటున్నాడు గూడూరు పట్టణంలోని చర్చి కాంపౌండ్‌కు చెందిన కరేటి అన్వేష్ పురుషోత్తం.

గూడూరు పట్టణానికి చెందిన అన్వేష్ పురుషోత్తం ఐదో తరగతి నుంచి చిల్లకూరు, వాకాడులోని గురుకుల పాఠశాలల్లో చదివాడు. ఈ పాఠశాలల్లో జానకిరామయ్య, వీరరాఘవులు అనే వ్యాయామ ఉపాధ్యాయుల వద్ద సాఫ్ట్‌బాల్, రెజిలింగ్, షాట్‌పుట్, వాలీబాల్ పోటీల్లో శిక్షణ పొందాడు. జిల్లా, రాష్ట్రస్థాయిల్లో విజేతగా నిలిచి బహుమతులు సాధించాడు. అటు తరువాత మెకానికల్ డిప్లొమో చేసి, గూడూరు సమీపంలోని ఓ పరిశ్రమలో ఉద్యోగంలో చేరాడు. అక్కడ పని చేస్తున్న సమయంలో 2014లో ఒక చేయి కోల్పోయాడు. ఆ తరువాత రెండేళ్లు ఎలాంటి ఆటల జోలికి వెళ్ల లేదు. అయితే తనలోని క్రీడాతృష్ణను వీడలేక ఒంటి చేత్తోనే షటిల్, షాట్‌పుట్, క్రికెట్ తదితర క్రీడలు సాధన చేశాడు. దివ్యాంగుల విభాగంలోని క్రీడా పోటీల్లో పాల్గొనడం మొదలెట్టాడు. అలాగే పారా అథ్లెటిక్స్‌లో పాల్గొని, రాణించడంతో అతనికి పలు పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది. దీన్ని సద్వినియోగం చేసుకున్న పురుషోత్తం నేడు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, తన సత్తా చాటి, కప్‌లను సొంతం చేసుకుంటున్నాడు.

> **ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు**
>
> క్రీడలపై ఉన్న మక్కువతోనే పలు క్రీడా పోటీల్లో పాల్గొంటున్నాను. బీడీసీఏలో సభ్యత్వం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇతర దేశాల్లో పోటీలకు వెళ్లే సమయంలో ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. దాతలు ఆర్థికంగా ప్రోత్సహిస్తే ఇంకా మరిన్ని విజయాలు సాధిస్తా.
>
> - అన్వేష్ పురుషోత్తం

విజయాలివీ..

- తొలిసారి వైజాగ్‌లో రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్‌లో పాల్గొని, డబుల్స్‌లో కాంస్య పతకం సాధించాడు.
- ఆ తరువాత అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని షాట్‌పుట్‌లో పసిడి పతకం సాధించాడు.
- తొలిసారిగా 2020లో వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల అథ్లెటిక్ క్రీడా పోటీల్లో పాల్గొని, షాట్‌పుట్‌లో పసిడి పతకం, డిస్కస్‌త్రోలో రజత పతకం సాధించాడు.
- 2021 సెప్టెంబర్‌లో అనంతపురంలో జరిగిన అథ్లెటిక్ రాష్ట్రస్థాయి పోటీలో షాట్‌పుట్ క్రీడలో రజిత పతకం సాధించాడు.
- 2022లో కాకినాడలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ షాట్‌పుట్‌లో బంగారు పతకం సాధించాడు.
- 2023లో వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్‌లో షాట్‌పుట్‌లో రజిత పతకం సాధించాడు.
- 2023 మేలో బెంగళూరులో జరిగిన అంతర్జాతీయస్థాయి ప్యారా అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ క్రీడల్లో మంచి ప్రతిభ కనపరిచి రజితం పతకం కైవసం చేసుకున్నాడు.
- 2021లో తిరుపతిలో జరిగిన జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనపరచడంతో సెలక్టర్లు జాతీయ జట్టుకు ఎంపిక చేశారు.
- 2023 హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత్ తరుపున విజయం సాధించగా అక్కడ ఇచ్చిన ప్రైజ్ మనీని ట్రస్టుకు అందజేశారు.
- 2023 అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌లో జరిగిన భారత్– బంగ్లాదేశ్ టీ –20 జట్టులో కీలక పాత్ర పోషించి, జట్టును రన్నరప్‌గా నిలిపాడు.
- బోర్డు ఆఫ్ దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్(బీడీసీఏ)లో సభ్యత్వం సాధించాడు.

అర్హులందరికీ పథకాల ఘనత జగనన్నదే


జెండాను ఎగురవేస్తున్న మేరిగ మురళీధర్

గూడూరురూరల్: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని స్థానిక సంస్థ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ మేరిగ మురళీధర్ అన్నారు. పట్టణంలోని ఆరో సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో అందించేలా వలంటీర్ వ్యవస్థను ప్రవేశ పెట్టారన్నారు. ఎన్నికలకు ముందుగా ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని, ఇలాంటి సీఎంను మరోసారి గెలిపించుకుని రాష్ట్ర భవిష్యత్తును మార్చుకునేలా ప్రతి ఒక్కరు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సచివాలయంలో లబ్ధిదారులకు చెందిన ఫ్లెక్సీని ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ బీ శ్రీనివాసులు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏ మురళీగౌడ్, బీ గోపీయాదవ్, వీ శ్రీధర్‌రెడ్డి, రూపేష్‌రెడ్డి, అల్తాఫ్, ఎం మధురెడ్డి పాల్గొన్నారు.

లారీ నుంచి జారిన ఐరన్ షీట్లు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు వద్ద మంగళవారం ఐరన్ షీట్ల లోడ్‌తో వెళుతున్న లారీ నుంచి రెండు ఐరన్ షీట్లు జారి రోడ్డుపై పడ్డాయి. దీంతో లారీ వెనుక వస్తున్న వాహనచోదకులు భయాందోళనలకు గురయ్యారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై పడి ఉన్న ఐరన్ షీట్లను పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన


నగరవనం మ్యాప్‌ను పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


ముస్లింలతో మాట్లాడుతున్న నేదురుమల్లి

వెంకటగిరిరూరల్: పట్టణంలోని జగనన్నకాలనీ ఎదురుగా 112.5 ఎకరాల్లో అభివృద్ధి చెందుతున్న నగర వనం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. అటవీశాఖ అసిస్టెంట్ కన్జర్వేటర్ జ్ఞాన ప్రకాష్, డిప్యూటీ రేంజర్ రాజేంద్ర ప్రసాద్‌తో కలసి నగర వనానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. నగరవనం ప్రాంతంతోపాటు భవనాన్ని పరిశీలించారు. ఇక్కడ చేపట్టనున్న అభివృద్ధి పనులపై అధికారులకు పలు సూచనలు సలహాలు తెలిపారు. అలాగే జగనన్న కాలనీలో నిర్మాణమవుతున్న ఇళ్లు, టిడ్కో గృహాలను పరిశీలించారు. పట్టణంలోని క్రాస్‌రోడ్డు సమీపం వద్ద ఉన్న బాలుర వసతి గృహం–3ను సందర్శించి వసతులు, భవనాల స్థితిగతులపై ఎంఈఓ వెంకటేశ్వర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అటవీ అధికారి రాంబాబు, వార్డెన్లు కొండాస్వామి, శ్రీనివాసప్రసాద్, ప్రవీణ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు

ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నేదురుమల్లి నివాసంలో మంగళవారం వక్ఫ్‌బోర్డు సభ్యులు పఠాన్ తాజ్‌ఉద్దీన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పలువురు ముస్లింలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకం కలిశారు. స్థానికంగా ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలపై నేదురుమల్లికి విన్నవించారు. దీనిపై స్పందించిన నేదురుమల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత ప్రాంతీయ విభేదాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ముస్లింల అభ్యున్నతికి తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్తాఫ్, హుసేన్, ఆలీ, ఇమ్రాన్ మున్నా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా కుల గణన సర్వే


రాపూరు: వలంటీర్లకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్


సైదాపురం: శిక్షణ ఇస్తున్న రీసోర్స్‌పర్సన్

సైదాపురం: మండలంలో ఈనెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు జరిగే కులగణన సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం కుల గణన సర్వేపై సచివాలయం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

అన్ని వివరాలు పొందుపరచాలి

రాపూరు: కులగణన సర్వేలో కుటుంబంలోని సభ్యులందరి ఆర్థిక, ఉద్యోగ, సామాజిక వివరాలను యాప్‌లో పొందుపరచాలని ఎంపీడీఓ అప్పాజీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు కుల గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శివభాస్కర్, ప్రత్యేకాధికారులు జిలానీ, ఆంజనేయులు, సర్దార్, మాస్టర్ ట్రైనర్ అనాల్ప, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లాలి

చిల్లకూరు: ప్రతి ఇంటికీ వెళ్లి కులగణన సర్వేలో పూర్తిస్థాయి వివరాలను తెలుసుకుని తమకు ఇచ్చిన ఫార్మాట్‌లో పక్కాగా నమోదు చేయాలని ఎంపీడీఓ గోపీనాథ్ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, వలంటీర్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించి, కుల గణనను చేయాలన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

చిల్లకూరు: జాతీయ రహదారిపై కారు బో ల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్ర యాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. స్థానికుల కథనం మేరకు.. వాకాడు మండలం వైఎస్సార్ సీపీ కన్వీనర్ నేదురుమల్లి ఉదయశేఖరరెడ్డి మరొకరితో కలసి గూడూరు రైల్వేస్టేషన్ వరకు వచ్చి, తిరిగి వాకాడుకు కారులో బయలు దేరా రు. మండలంలోని రైటార్ సత్రం వద్దకు వచ్చే సరికే ఆవులు కారుకు అడ్డుగా వచ్చాయి. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. అటుగా వేళ్లే వారు ఉదయశేఖర రెడ్డిని గుర్తించి, ప్రమాదంపై ఆరా తీశారు. విషయం పోలీసులకు తెలియడంతో వారు సంఘటనా స్థలాని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.


కాలువలో బోల్తా పడిన కారు

నేత్రదానం

సూళ్లూరుపేట: మండలంలోని మంగళంపాడు గ్రామానికి చెందిన ఉద్దండి రాజవేలు (75) మంగళవారం మృతి చెందడంతో ఆయన కళ్లదానం చేశారు. సూళ్లూరుపేట కేంద్రంగా నడుస్తున్న ఆచార్య భరధ్వాజ సేవాసంస్థ మృతుని కుటుంబసభ్యుల అంగీకారంతో చెన్నై శంకరనేత్రాలయ వారికి కళ్లు అందజేశారు. సూళ్లూరుపేటలో జరుగుతున్న నేత్రదాన మహోద్యమంలో ఉద్దండి రాజవేలు 425వ నేత్రదాతగా నమోదయ్యారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి



కలువాయి: బ్రోచర్లు పంపిణీ చేస్తున్న నాయకులు, రాపూరు: బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు

కలువాయి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మాదన్నగారిపల్లె సచివాలయం పరిధిలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా ప్రతి కుటుంబానికి జరుగుతున్న మేలును ప్రజలు గుర్తెరిగి మరోసారి ఆయనకు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, ఇంటింటికీ సంక్షేమ కార్యక్రమాల బ్రోచర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ యజ్ఞపవన్, నాయకులు రామచంద్రయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కాంతులు

రాపూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అంది, సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని జేసీఎస్ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి అన్నారు. రాపూరు మండలం సంక్రాంతిపల్లెలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో వలంలటీర్లకు కిట్లు పంపిణీ చేసి, పార్టీ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంచలరెడ్డి, నాయకులు బాలకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, జయరామిరెడ్డి, వెంకటరెడ్డి, పెంచలయ్య, రత్నాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రమణారెడ్డి, పిచ్చిరెడ్డి, శివయ్య, మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

గూడూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. రామలింగాపురంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. సర్పంచ్ సంపూర్ణమ్మ, సొసైటీ అధ్యక్షుడు ఏ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

పెంచలకోనలో భారీ వర్షం


రాపూరు: పెంచలకోనలో కురుస్తున్న వర్షం,


పెంచలకోనలో పారుతున్న జలపాతం

రాపూరు: మండలంలోని రాపూరు, పెంచలకోనతోపాటు పలు గ్రామాల్లో మంగళవారం తెల్లవారు జామునుంచి భారీ వర్షం కురుస్తోంది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పెంచలకోనలో భారీ వర్షం కువరడంతో సమీపంలోని కొండల నుంచి జలపాతాలు జాలువారి కనువిందు చేశాయి. వర్షానికి లోతట్టు ప్రాంతం జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

సైదాపురంలో..

సైదాపురం: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో చెరువులోకి నీరు వస్తాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం: మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మంగళవారం రోజంతా కూడా మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పలు గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు చేరింది. డీవీ సత్రం, అక్కరపాక, మినమనముడి, నెలబల్లి గ్రామాల సమీపంలోని రైలు పట్టాలు దాటే ప్రాంతంలోని అండర్ బ్రిడ్జిల్లో వర్షపు నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.


సైదాపురంలో..


దొరవారిసత్రం: అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీరు

తుపానుపై అప్రమత్తత అవసరం


చిల్లకూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు


గూడూరురూరల్: సమీక్షిస్తున్న తహసీల్దార్

గూడూరురూరల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాల లీలారాణి సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఆమె అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రెండు రోజులు పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న సమాచారం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం పంబలేరు, వేములపాళెం, తిప్పవరప్పాడు వద్ద ఉన్న చప్టాలను పోలీస్ అధికారులతో కలసి పరిశీలించి జాగ్రత్తలు తీసుకునేలా సూచనలు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

దొరవారిసత్రం: మండలంంలో రెండు రోజులుగా భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు వీస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి కోరారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండల స్థాయి అధికారులతో డీవీ సత్రం తహసీల్దార్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వర్షాల తీవ్రతపై సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రఘురామయ్య, ఎస్ఐ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సహకారం అందించాలి

చిల్లకూరు: అల్పపీడనం దృష్ట్యా తీర ప్రాంత గ్రామాల్లో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం తదితర ప్రాంతాలు సముద్రానికి దగ్గరగా ఉన్నందున అక్కడి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేలా చూసుకోవాలని అన్నారు. అగ్నిమాక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఈ సమీక్షలో ఎస్ఐ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి


సుబ్రహ్మణ్యం మృతదేహం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బస్సు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తొట్టంబేడు మండలం దయనేడు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కూలి పనులు చేసుకుంటు ఒంటరిగా ఉంటున్నాడు. నాయుడుపేటలో అతని బంధువులు ఉండడంతో అప్పుడప్పుడు పేటకు వస్తుంటాడు. ఈక్రమంలో సోమవారం సుబ్రహ్మణ్యం నాయుడుపేటకు వచ్చాడు. తిరిగి గ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి నడిచి వస్తుండగా తిరుపతి నుంచి గూడూరుకు వెళతున్న గూడూరు డిపోకు చెందిన ఆర్టీసీ హైయర్ బస్సు ఆర్టీసీ ప్రాంగణంలోకి వస్తు సుబ్రహ్మణ్యంను ఢీకొంది. గాయపడిన అతడిని తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్సలు పొందుతూ మృతి చెందాడు. సమాచారమందుకున్న పోలీసులు మంగళవారం తిరుపతికి వెళ్లి సుబ్రహ్మణ్యం మృతదేహానికి పోస్టుమార్టం జరిపించి, కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరుడు జీ రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.